క్లుప్తంగా

క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని ధర్నా

మిడ్జిల్: మండల కేంద్రంలోని వెంచర్లలో గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం భూమిలో రేయిన్‌బో వెంచర్‌లో 3 ఎకరాల భూమి క్రీడా మైదానానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ కొంత మంది క్రీడాకారులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, మాజీ ఎంపీపీ సుదర్శన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో వెంచర్ చేసిన ల్యాండ్‌ను ఇటీవల వ్యవసాయ భూమిగా మార్చి ఇతరులకు విక్రయించారని, ఆ భూమిపైన అధికారులు విచారణ చేసి యువత ఆడుకోవడానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో భాస్కర్, వరుణ్, రవీంద్ర, శ్రీను, గోపాల్, సుదర్శన్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఎస్‌లో జర్నలిజంపై వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 'జర్నలిజం మౌలిక అంశాలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ సామాజిక అంశాలపై అవగాన పెంచుకుంటే జర్నలిజంలో రాణించేందుకు అవకాశాలు ఉన్నాయని, వ్యవస్థలో మీడియా కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ మేరకు జర్నలిస్టు విజయ్‌భాస్కర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ కృష్ణమూర్తి, అధ్యాపకులు రవీందర్, సురేష్, సాంబశివరావు, సుభాషిణి, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా నరేందర్‌రెడ్డి

మహమ్మదాబాద్: మహమ్మాబాద్ మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా నరేందర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గండీడ్ మండలం నుంచి మహమ్మదాబాద్ కొత్త మండలం ఏర్పడిన విషయం తెలిసిందే. ఇప్పటి దాక రెవెన్యూ శాఖ పరంగా విభజన జరిగినా పంచాయతీరాజ్ శాఖ విభజన కాలేదు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన మండలానికి ఎంపీడీఓను నియమించారు. ప్రస్తుతం నరేందర్‌రెడ్డి గండీడ్ మండల పంచాయతీ అధికారిగా వ్యవహరిస్తున్నారు. మహమ్మదాబాద్ ఎంపీడీఓగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహిళను చంపిన వ్యక్తిని ఉరితీయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో వెంకటేశ్వరనగర్ కాలనీలో నివాసముంటున్న మహిళను నరికి చంపిన సైకో గురుమూర్తిని వెంటనే ఉరితీయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పద్మావతి డిమాండ్ చేశారు. గురువారం భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యాలయంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహిళా చట్టాలను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారించి ఉరి శిక్షలు వేయాలన్నారు. కార్యక్రమంలో భారత మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు భార్గవి, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, సంఘం సభ్యులు ఇందిరమ్మ, సత్యమ్మ, పద్మ, పార్వతమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ స్వాధీనం

రాజాపూర్: అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని గురువారం కేసు నమోదు చేసినట్లు రాజాపూర్ ఎస్ఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మండలంలోని రాయపల్లి గ్రామ శివారులో తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలేపల్లి రహదారిలో మట్టితో వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ తిరుపతితో అనుమతి పత్రాలు కోరగా, చూపించలేదు. దీంతో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

డిగ్రీ ప్రథమ సంవత్సరం ఫలితాలు విడుదల

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం ఫలితాలు గురువారం పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ ఏడాది ఫస్ట్ సెమిస్టర్‌లో 443మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 128 మంది 5 పేపర్లలో ఉత్తీర్ణత పొంది 29శాతం ఫలితాలు సాధించారు. సెకండ్‌సెమిస్టర్‌కు 315మంది ప్రమోట్ అయ్యారు. ఫలితాల విడుదలలో పీయూ రిజిస్ట్రార్ డి.చెన్నప్ప, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి సులేమాన్, వైస్ ప్రిన్సిపాల్ నర్మద, అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగు జాడల్లో నడుద్దాం

- గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు నేతల నివాళులు
- పలుచోట్ల ప్రతిజ్ఞలు



మహబూబ్‌నగర్‌లో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: మహాత్మాగాంధీజీ అడుగు జాడల్లో నడుద్దామని డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్ అన్నారు. మహాత్ముడి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో గురువారం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గాంధీజీ జీవనమే జాతికి సందేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ బెక్కరి అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెన్‌హర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➪ మహబూబ్‌నగర్ మండలంలోని జేపీఎన్‌సీ కళాశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సుజీవన్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

➪ జడ్చర్లలో ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు గాంధీజీకి నివాళులర్పించారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వాసవి కమాన్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతబజార్‌లో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యేశ్వర ఆశ్రమ నిర్వాహకులు శ్రమదానం చేశారు. బూర్గుపల్లిలో బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➪ మిడ్జిల్ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి అఖిలపక్షం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్వాల్‌రెడ్డి, గౌస్, సుదర్శన్, రాజేశ్వర్, సత్యం, సంపత్, నర్సింహులు గుప్త, విజయ్, భద్రయ్య, పర్వతాలు, మల్లయ్య పాల్గొన్నారు.

➪ హన్వాడ మండలం గుడ్డిమల్కాపూర్‌లో కులవివక్ష, అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతికి స్వస్తి పలకాలని డీటీ వెంకటేశ్వర్‌రావు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తూ మహాత్ముడికి నివాళులర్పించారు. సబ్‌సెంటర్‌లో హెల్త్‌వర్కర్స్‌తో స్థానిక హెల్త్ అధికారిని కుష్ఠువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

➪ గండేడ్ మండలం పెద్దవార్వాల్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, బాలస్వామి, భీమోజీ, వీరన్న, ప్రకాష్, దిగంబర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో వాసవీ కమాన్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘాలు



మిడ్జిల్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు



గుడ్డిమల్కాపూర్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

జీపీ నిధులపై సమగ్ర వివరాలు తెలపాలి



పోల్కంపల్లి కార్యదర్శి నాగేందర్‌గౌడ్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామ పంచాయతీ నిధులకు సంబంధించిన సమగ్ర వివరాలను గ్రామస్తులకు తెలపాలని గురువారం మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి నాగేందర్‌గౌడ్‌ను కోరారు. గ్రామానికి సమీపంలో ఉన్న గుంపోలు గట్టు వద్ద నడుస్తున్న క్రషర్ మిషన్ ద్వారా ప్రభుత్వానికి రాయల్టీ కింద రూ.1.07కోట్లు చెల్లిస్తే గ్రామ పంచాయతీకి రావాల్సిన రూ.30లక్షలు వచ్చాయా? లేదా అని ప్రశ్నించారు. అదేవిధంగా గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవాగు నుంచి పాలమూరు శాండ్ పేరుతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా జిల్లా కేంద్రానికి తరలించారని, అదేవిధంగా జీపీ ట్రాక్టర్‌తో గ్రామంలో ఇళ్లు కట్టుకున్న వారికి ఇసుకను తరలించగా, వచ్చిన నిధుల వివరాలు ప్రజలకు తెలపాలని కోరారు. మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి తన క్రషర్‌కు సంబంధించిన రాయల్టీని ప్రభుత్వానికి చెల్లించినా జీపీకి రావాల్సిన రాయల్టీ నిధులు గ్రామ పంచాయతీకి రాకుంటే ఇన్నాళ్లు సర్పంచ్‌గా ఏం పని చేశారని గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధుల పూర్తి వివరాలను గ్రామసభ ద్వారా గ్రామస్తులకు తెలపాలని కార్యదర్శిని కోరారు.

ప్రైవేట్ కళాశాలలపై వేధింపులు ఆపాలి

- డీఐఈఓకు యాజమాన్యాల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై ఇంటర్ బోర్డు అధికారుల వేధింపులను తక్షణమే ఆపాలని కోరుతూ జిల్లా ఇంటర్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డీఐఈఓ కౌసర్‌జహాన్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇటీవల బోర్డు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించిందన్నారు. దీనికి లక్షల్లో ఖర్చులు అవుతున్నాయని, నష్టాల్లో కళాశాలలను నిర్వహిస్తుంటే ఇదో అదనపు భారం అవుతుందన్నారు. మిక్స్‌డ్ ఆక్యూపెన్సీ ఉన్న కళాశాలలకు అనుమతులు ఇచ్చేందుకు రూ.లక్షల్లో పెనాల్టీలు విధించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రాష్ట్ర కమిటీ సూచన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోమని, పరీక్షల నిర్వహణకు సెంటర్‌లను ఇవ్వలేమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిర్ణయంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం కేవలం బోర్డు అధికారులకు మాత్రమే వ్యతిరేకమని, ప్రభుత్వానికి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజేత వెంకట్‌రెడ్డి, జహీర్‌అక్తర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టును గుర్తిస్తే నివారణ సాధ్యం

జడ్చర్ల టౌన్/మిడ్జిల్: కుష్టువ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే పూర్తి నివారణ సాధ్యమని సూక్ష్మ జీవశాస్త్ర విభాగాధిపతి డా.మాధురి అన్నారు. గురువారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. జెడ్పీహైస్కూల్, సెయింట్ ఆగ్నెస్ పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని కుష్టువ్యాధిపై అవగాహన పెంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సదాశివయ్య, ప్రవీణ్‌కుమార్, డా.నందకిశోర్‌లు పాల్గొన్నారు.

➪ మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, 6సబ్ సెంటర్లలో వైద్య సిబ్బందితో వైద్యాధికారి శివకాంత్ కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ సౌజన్య, సూపర్‌వైజర్ ప్రసాద్, సంపత్, దేవయ్య, జంగయ్య, ప్రమీల, రాజేశ్వరి, చంద్రకళ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తిలో మొక్కలే మేటి



జడ్చర్ల టౌన్: ఆహార ఉత్పత్తిలో మొక్కలే మేటి అని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసులు అన్నారు. గురువారం డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఎస్సీ, బీజెడ్‌సీ విద్యార్థులకు 'మొక్కలు–ఆహార ఉత్పత్తి' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. మొక్కలు ఆహారాన్ని తన పత్రంలో ఎలా తయారు చేసుకుంటాయనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. సూర్యకాంతి ఆవశ్యకత, నీటిపాత్రతో పాటుగా అందులో జరిగే జీవన క్రియలను సోదాహరంగా తెలిపారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.నర్మద, అధ్యాపకులు డా.సదాశివయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అమరవీరుల దినోత్సవం



మౌనం పాటిస్తున్న కలెక్టర్ విజయేందిర, అడిషనల్ కలెక్టర్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో కలెక్టర్ విజయేందిర నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో అమరుల స్మరించుకుంటూ 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌ఓ రవికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల పన్ను వసూలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో కార్పొరేషన్ అధికారులు ఆస్తిపన్ను, మున్సిపల్ దుకాణాల అద్దె వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. తాజాగా గురువారం 49 వార్డుల పరిధిలో ఇంటింటికీ తిరిగిన వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ విభాగం సిబ్బంది ఏకంగా సుమారు రూ.20 లక్షలు వసూలు చేశారు. క్లాక్ టవర్, మార్కెట్ ఏరియాలోని వివిధ దుకాణాల నుంచి రూ.10.50 లక్షల వరకు అద్దె వసూలైంది. వాస్తవానికి ఈ రెండు ప్రాంతాలలోనే రూ.12 కోట్ల పాతబకాయిలు పేరుకుపోయాయి. కార్యక్రమంలో ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, ఆర్‌ఐలు ముజీబుద్దీన్, రమేష్, పెంటయ్య, అహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈజీఎస్‌లో పని చేసే ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని ఆ సంఘం ఉద్యోగుల జేఏసీ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా వేతనాలు సక్రమంగా రావడం లేదని ప్రస్తుతం 3 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెనుకాడమని హెచ్చరించారు. శాంతకుమార్, రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనాలపై జాగ్రత్తలు తప్పనిసరి

- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎమ్మెల్యే అనిరుధరెడ్డి

రాజాపూర్: వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లలో ప్రయాణిస్తే సీట్‌బెల్ట్ ఖచ్చితంగా పెట్టుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆయన పెద్దాయపల్లి ఎక్స్‌రోడ్డువద్ద నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే కాకుండా, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నా రు. జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ రవి, నాయకులు వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, శంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహజ్యోతి'ని అందించాలి

- విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ
- విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అర్హులందరికీ చేరేలా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ అన్నారు. గురువారం ఎస్ఈ చాంబర్‌లో విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం అమల్లో ప్రజలకు సందేహాలు వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాపై వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రీజినల్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులర్ చేసేల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ నవీన్‌కుమార్, ఎస్ఏఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి గంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా నూరుల్ నజీబ్

భూత్పూర్: మున్సిపల్ కమిషనర్‌గా నూరుల్ నజీబ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఇన్‌చార్జిగా మూడు నెలలు వ్యవహరించారు. ఆరునెలల క్రితం భూత్పూర్ కమిషనర్‌గా పని చేసిన నూరుల్ నజీబ్ బదిలీపై వెళ్లారు. తిరిగి మళ్లీ భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు.

నవాబుపేటలో 15 ఎంపీటీసీ స్థానాలు

- జాబితా ప్రకటించిన అధికారులు

నవాబుపేట: మండలంలో స్థానిక సంస్థలకు సంబంధించి ఎంపీటీసీల సంఖ్యను గురువారం మండల అధికారులు ప్రకటించారు. ఆయా ఎంపీటీసీల పరిధిలోని పంచాయతీలలో ఎంపీటీసీ నియోజకవర్గాల జాబితాను వారు ప్రకటించారు. ఈ సందర్భంగా గతంలో మండలంలో 54 గ్రామాలకుగాను 19 ఎంపీటీసీలు ఉండగా, గతేడాది కొత్త మండలంగా ఏర్పడ్డ చౌడాపూర్ మండలంలోకి 12 గ్రామాలు, 4 ఎంపీటీసీలు నియోజకవర్గంలో చేరటంతో తాజాగా నవాబుపేట మండలంలో 15 ఎంపీటీసీలు మాత్రమే ఉన్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ ప్రకటించారు. ఆరేళ్ల క్రితం నవాబుపేట మండలంలో చేరిన విలీన గ్రామాలు తాజాగా మళ్లీ అదే వికారాబాద్ జిల్లా పరిధిలోకి చేరటంతో ఎంపీటీల సంఖ్య తగ్గింది. 3500 జనాభాకు ఒక్కటి చొప్పున ఎంపీటీసీ నియోజకవర్గం ఏర్పాటు చేయాల్సి ఉండగా, గతంలో ఉన్న అన్ని ఎంపీటీసీ స్థానాలు యథావిధిగా ఉండనున్నట్లు అధికారులు ప్రకటించారు. వాటిపై అభ్యంతరాలుంటే వచ్చే నెల 1, 2వ తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలని మండల అధికారులు పేర్కొన్నారు. ఎంపీటీసీల సంఖ్య ఖరారు తుది జాబితా 3న ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి



మన్యంకొండ బ్రహ్మోత్సవాలపై చైర్మన్, ఈఓలతో చర్చిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, పాలక మండలి సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై దేవస్థానం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా బ్రహ్మోత్సవాలు కొనసాగేలా పాలక మండలి సభ్యులు కృషి చేయాలని కోరారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మెట్టుకాడి ప్రభాకర్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ నియామక పత్రం అందజేశారు. జిల్లాలో ముదిరాజ్‌లను ఐక్యం చేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాజకీయ ప్రాధాన్యత లేని ముదిరాజ్‌లను చైతన్యం చేయాలన్నారు. గ్రామాల్లో ముదిరాజ్ కమిటీలు వేసి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష హోదాతో పాటు 60 డివిజన్లలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల్లో ముదిరాజ్‌లకు అత్యధిక సీట్లు ముదిరాజ్‌లకు కేటాయించేలా ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్, బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రి యాదయ్య, జీ ఆశన్న, శ్రీనివాస్, కృష్ణయ్య, నారాయణ, ఆంజనేయులు, నరసింహులు, వెంకట్‌రాములు, చరణ్‌తేజ్, అశోక్, కృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో జాగ్రత్త



మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల టౌన్: అపరిచితవ్యక్తులు, సామాజిక మాధ్యమాలతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో అమ్మాయిలు తమ ఫొటోలను పెట్టుకోకూడదని, కుటుంబ సభ్యులు సైతం అమ్మాయిల ఫొటోలు పెట్టరాదన్నారు. 21ఏళ్లు వచ్చే వరకు పెళ్లిళ్లు చేసుకోరాదని, ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, గురువులలో ఒకరికి సమాచారం ఇవ్వాలన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు గోపాల్, యుగంధర్, శంకర్‌బాబు, నాగరాజు, కృష్ణవేణి, వడెన్నలు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవు

నవాబుపేట: వ్యాపారులు రింగ్‌గా మారి వేరుశనగ పంటకు ధరను తక్కువగా ఇస్తే చర్యలు తప్పవని మార్కెట్ చైర్మన్ లింగం హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యా ర్డులో మార్కెట్ అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల రైతులు వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర రాలేదని అక్కడక్కడ ఆందోళనలు చేస్తున్న తరుణంలో అలాంటి సంఘటనలు ఇక్కడ జరగకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. వ్యాపారులు రైతులను మో సం చేసే విధంగా రింగుగా మారి టెండర్లు వేసి గిట్టుబాటు ధరకంటే తక్కువగా ధర వేస్తే వారిపై చర్య లు ఉంటాయని ఆయన హెచ్చరించారు. రైతులు సైతం తమకు ధర తక్కువగా వస్తే వెంటనే మా ర్కె ట్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, వారికి అధికారులు, మార్కెట్ పాలకవర్గం అండగా ఉంటుందన్నారు. రైతులకు న్యాయం చేయటమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందన్నారు. సమావేశంలో పాలకవర్గం తులసీరాంనాయక్, కుమార్, వెంకటేష్, జమీర్, మార్కెట్ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

డ్రైవర్ బాధ్యత కీలకం

పాలమూరు: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు కీలకంగా ఉంటారని ఆర్టీఓ రఘుకుమార్, ఆర్ఎం సంతోష్‌కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బస్సు డ్రైవర్ చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలు స్టీరింగ్ నడిపే డ్రైవర్ చేతిలో ఉంటాయని, ఈ క్రమంలో ఎవరూ కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదన్నారు. అనంతరం రీజియన్ లెవెల్‌లో అత్యధిక ప్రమాద రహిత సర్వీస్‌లు అందించిన ముగ్గురు డ్రైవర్లతో పాటు పది డిపోల పరిధిలో అత్యధిక ప్రమాద రహిత సర్వీస్‌లు అందించిన 33మంది ఆర్టీసీ డ్రైవర్లను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. దీంతో పాటు చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, డిప్యూటీ ఆర్ఎంలు శ్యామల, లక్ష్మీధర్మ, డిపో మేనేజర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి



భూత్పూర్ చౌరస్తాలో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూత్పూర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పాలన 420 రోజుల్లో హామీలను అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. సీనియర్ నాయకులు నారాయణగౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, నర్సింహులు గౌడ్, మనిమోని సత్యనారాయణ, రాములు, రామునాయక్, మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్, బాల్‌రెడ్డి, నాగన్న ఉన్నారు.

➪ గండీడ్ మండలం కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దాక ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

➪ కోయిల్‌కొండ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తూ గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.